
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.5
కనిష్ఠం 24.0

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శనివారం 3 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	551.30 (212.6510)	4,61,797	31,464
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.15 (3.73)	453.93	514.00
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	103.96 (1.13)	277	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240

అయిదేళ్లలో 35 లక్షల ఎకరాల

కొత్త ఆయకట్టు



కృష్ణమ్మకు వాయినం సమర్పిస్తున్న మంత్రులు ఉత్తమ్, వెంకట్‌రెడ్డి

- భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- మంత్రి కోమటిరెడ్డితో కలిసి నాగార్జునసాగర్ ఎడమ, వరద కాల్వకు నీటి విడుదల

రాష్ట్రంలో రాబోయే అయిదేళ్లలో 35లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సృష్టిస్తామని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రాజెక్టు ఎడమ కాల్వకు, వరదకాల్వకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇరిగేషన్ రంగం ధ్వంసమైందన్నారు. రూ.1.80లక్షల కోట్ల అప్పులు చేసి కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ తదితర ప్రాజెక్టులు నిర్మిస్తే, కాళేశ్వరం కింద 95వేల ఎకరాల ఆయకట్టు చూపించినా ఆ ప్రాజెక్టు నాసిరకంగా కట్టడంతో కూలిపోయిందన్నారు. రూ.లక్ష కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందని, సీతారామ, పాలమూరు ప్రాజెక్టుల కింద ఒక్క ఎకరం కూడా కొత్త ఆయకట్టు రాలేదన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తిచేసి, కొత్త ప్రాజెక్టులు చేపట్టి రాబోయే అయిదేళ్లలో స్పష్టమైన లక్ష్యంతో నూతన ఆయకట్టును సృష్టించేందుకు స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళుతోందన్నారు. సాగర్ ఎడమకాల్వపైనా, ఉమ్మడి జిల్లా ఇతర జలవనరుల ఆధారంగా నిర్మించిన పాత ఎత్తిపోతల పథకాలను పూర్తి సామర్థ్యంతో నడిచేందుకు, అదేవిధంగా నాగార్జునసాగర్, దేవరకొండ, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో కొత్తగా చేపట్టి పెండింగ్‌లో ఉన్న అన్ని లిఫ్టులను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా నిలుపుతాం: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా నిలుపుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ పథకాన్ని 1983లో అప్పటి మంత్రి జానారెడ్డి మంజూరు చేయించారని, ఆ తర్వాత వైఎస్ఆర్ హయాంలో పథకాన్ని చేపట్టి తమ హయాంలోనే సొరంగమార్గంలో 90శాతం పూర్తయిందని, మిగిలిన పదిశాతం పనులను పదేళ్లలో పూర్తిచేయలేదని విమర్శించారు. మళ్లీ ప్రజాప్రభుత్వంలో తాము ఈ పథకాన్ని మూడేళ్లలో పూర్తిచేసి ఏఎమ్మార్పీ, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టుల ద్వారా నాలుగు లక్షల ఎకరాలకు గ్రావిటీ ద్వారా నీటిని అందించి నల్లగొండ జిల్లాని సస్యశ్యామలం చేస్తామన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి మంత్రులిద్దరూ కృషి చేస్తున్నారన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలిచ్చే విషయమై చొరవ తీసుకోవాలని కోరగా మంత్రులు స్పందిస్తూ ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఉంటే అక్కడ గుర్తించి ఇచ్చే ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, నీటి పారుదలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ అనిల్, సీఈ నాగేశ్వరరావు, కలెక్టర్ నారాయణరెడ్డి, సీఈ నాగేశ్వర్‌రావు, ఈఈ మల్లికార్జున్‌రావు, డీఈలు శ్రీనివాస్, పరమేష్ ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కాలం అయిందని, నీటిని ముందస్తుగానే విడుదల చేయడం తమకు భగవంతుడిచ్చిన అవకాశంగా భావిస్తున్నామని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని, రాబోయే మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, గంధమల్ల రిజర్వాయర్, ఏఎమ్మార్పీ కాల్వల లైనింగ్ పనులు పూర్తిచేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామన్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ) /నాగార్జునసాగర్



జలకళ సంతరించుకున్న నాగార్జునసాగర్ ప్రాజెక్ట్

నాగార్జునసాగర్‌కు


జలకళ

- ఎగువనుంచి 4,61,797 క్యూసెక్కుల వరద
- మూడు రోజుల్లో గేట్లు ఎత్తే అవకాశం

నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువనుంచి 4.61లక్షల క్యూసెక్కుల వర ద వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రస్ట్ గేట్లను (నీటి మట్టం 546 అడుగులు) తాకిం ది.ఎగువనుంచి 4,89,361 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో 885అడుగుల(215.8070టీఎంసీలు) పూర్తిస్థాయి నీటిసామర్థ్యం గల శ్రీశైలం ప్రాజెక్టు కాగా శుక్రవారం సాయంత్రాని కి 883.30అడుగులుగా (206.0996టీఎంసీ)నమోదైంది. శ్రీశైలం ప్రాజెక్టు 10క్రస్ట్ గేట్లను 20అడుగుల మేర ఎత్తి, కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తుండటంతో 4,61,797 క్యూసెక్కుల నీరు సాగర్‌కు చేరింది. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.5050టీఎంసీలు) కాగా ప్రస్తుతం 551.30 అడుగులుగా (212.6510 టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 5,292 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 778 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 23,444 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,650 క్యూసెక్కులు మొత్తంగా సాగర్ నుంచి మొత్తం 31,464 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతుండగా ఎగువ నుంచి 4,61,797 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూడు రోజుల్లో సాగర్ గేట్లు ఎత్తే అవకాశం

సాగర్‌కు ఎగువ నుంచి ఇలాగే వరద రాక కొనసాగితే మరో మూడు రోజుల్లో క్రస్ట్ గేట్లను ఎత్తే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 551.30 అడుగులుగా ఉంది. మరో 39 అడుగులకు చేరుకుంటే సాగర్ నీటి మట్టం పూర్తి స్థాయికి చేరుకుంటుంది. సాగర్‌కు రోజుకు ఎగువనుంచి 12 అడుగుల చొప్పున నీరు వచ్చి చేరుతుంది. కాబట్టి మరో మూడు రోజుల్లో పూర్తి స్థాయికి చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తి సామర్థ్యం 312.5050 టీఎంసీలు కాగా ప్రస్తుతం 212.6510 టీఎంసీలుగా ఉంది మరో 100 టీఎంసీల నీరు సాగర్‌కు వచ్చి చేరితే పూర్తి సామర్థ్యానికి చేరుకుంటుంది.



ఎడమ కాల్వ నుంచి కృష్ణమ్మ పరవళ్లు

వరదకాల్వకు నీటి విడుదల

పెద్దవూర: మండలంలోని పూల్యాతండా సమీపంలో పంప్‌హౌస్ నుంచి ఎస్ఎల్‌బీసీ లోలెవల్ కెనాల్(వరదకాల్వ)కు శుక్రవారం మంత్రులు కోమటిరెడ్డివెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. ఒక మోటార్ ద్వారా 450 క్యూసెక్కుల నీటిని వదిలారు.

నల్లగొండ జిల్లాలోని మూడు నియోజకవర్గాలైన నాగార్జునసాగర్, నల్లగొండ, మిర్యాలగూడలలో 30 చెరువులు 45 డిస్ట్రిబ్యూటర్ల ద్వారా ఈ కాల్వ సాగునీటిని అందిస్తుంది. కార్యక్రమంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, బాలూనాయక్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మాజీ జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి 'స్వచ్ఛదనం-పచ్చదనం'

నిర్వహించాలి

కలెక్టర్ సి. నారాయణరెడ్డి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ టౌన్, **ఆగస్టు 2:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 5వ తేదీ నుంచి 9 వరకు 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని అన్ని గ్రామాలు, మునిసిపాలిటీల్లో నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రం నుంచి మండలస్థాయి అధికారులతో 'స్వచ్ఛదనం-పచ్చదనం'పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత, మొక్కలు నాటడం, తాగునీరు, వివిధ సంస్థల పరిశుభ్రత, వీధి కుక్కల బెడద తగ్గించడం వంటి అంశాలను చేపట్టాలన్నారు. అన్ని గ్రామాల్లో నీటి నిల్వ కట్టడాలను నిర్మించాలని, శ్రమదానం ద్వారా పల్లెలను పరిశుభ్రం చేయాలన్నారు. ఈ నెల 7న పల్లెనిద్ర చేసి 8వ తేదీన అన్ని గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామంలో నీటి నిల్వ ప్రదేశాలన్నింటినీ గుర్తించి నీరు నిల్వ ఉండకుండా పూడ్చి వేయాలని, దోమలు రాకుండా అరికట్టాలన్నారు. ప్లాస్టిక్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్లాస్టిక్ వాడకుండా చూడాలన్నారు. ఎక్కడైనా తాగునీటి లీకేజీలు ఉంటే, వెంటనే వాటిని అరికట్టాలని, కుక్కల బెడద ఇటీవల ఎక్కువైనందున ప్రజలు కుక్కల బారిన పడకుండా చూడాలన్నారు. గ్రామాలు, మునిసిపాలిటీల్లో అన్ని ఇళ్లకు మిషన్ భగీరథ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీల్లో విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి అవకాశం ఉన్నచోట దాతల సహకారం తీసుకోవాలని, ప్రత్యేకించి పురాతన కట్టడాలను పరిశుభ్రం చేయటం, వాటిని పరిరక్షించాలన్నారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం'పై ఈ నెల 3న అన్ని గ్రామాల్లో సంబంధిత సిబ్బందితో సమావేశం నిర్వహించి కార్యక్రమ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, డీఎఫ్‌వో రాజశేఖర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు రక్షణ!

- రూ. 27.18 లక్షల మేర కలెక్టర్ నిధులు
- ఏఎంఆర్‌పీ పరిధి 4 డివిజన్లలో తొలి విడత 9 చెరువులు
- డివిజన్‌కు రెండు చెర్వుల చొప్పున ఎంపిక
- ఎఫ్‌టీఎల్ మార్కింగ్‌లు- కాంక్రీట్ పిల్లర్లు
- పనుల ప్రారంభానికి టెండర్లే తరువాయి



నార్కట్‌పల్లి పెద్ద చెరువు

నార్కట్‌పల్లి, ఆగస్టు 2 : చెరువుల ఆక్రమణలకు ఇక చెక్ పడనుంది. విలువైన చెరువుల స్థలాలపై కన్నేసిన రాజకీయ నాయకుల కబ్జా పర్వానికి తెరపడనుంది. చట్టంలోని లొసుగులను, అవినీతి అధికారులను ఆసరా చేసుకుని చెర్వు శిఖం భూములను రియల్ ఎస్టేట్ వెంచర్ల పేరిట ప్లాట్లుగా మార్చుతున్న దందాకు ఫుల్ స్టాప్ పడనుంది. చెరువుల భూములను కాపాడేందుకు అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలకు ఉపక్రమించబోతోంది. జిల్లాలో చెరువుల భూముల ఆక్రమణలపై కలెక్టర్ నారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. చెరువులకు సంబంధించిన ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవెల్)ను గుర్తించి హద్దురాళ్లను పక్కాగా ఏర్పాటు చేయడం ద్వారా ముున్ముందు కూడా ఆక్రమణలకు తావులేని శాశ్వత పరిష్కారానికి బాటలు వేస్తున్నారు.

ప్రతిపాదనలకు పరిపాలన అనుమతులు

చెర్వుల భూములు ఆక్రమణకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్ట్(ఏఎంఆర్‌పీ) పరిధిలోని నాలుగు డివిజన్లకు చెందిన నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఇటీవల కలెక్టర్‌కు ప్రతిపాదనలను అందజేశారు. ఆయా డివిజన్లకు చెందిన నియోజకవర్గ ఎమ్మెల్యేలతో చర్చించి వారు సూచించిన చెర్వులనే ప్రతిపాదన జాబితాలో చేర్చారు. ఆ ప్రతిపాదనలను పరిశీలించిన కలెక్టర్ వాటికి పరిపాలనా అనుమతులను ఇచ్చారు. తొలుత ప్రతీ డివిజన్ పరిధిలో రెండు చెర్వుల చొప్పున పకడ్బందీగా సర్వే జరిపి సంబంధిత చెర్వులకు ఎఫ్‌టీఎల్‌లను నిర్ధారించనున్నారు. అనంతరం అటవీశాఖ తరహాలో కాంక్రీట్ పిల్లర్లను చెర్వు ఎఫ్‌టీఎల్ హద్దుల వద్ద నిర్మించనున్నారు. ఇందుకు గాను కలెక్టర్ తన కోటా నిధులు రూ.27.18లక్షలను మంజూరు చేశారు. వచ్చే ఏడాది మరికొన్ని ప్రాధాన్యం గల చెర్వులను గుర్తించి నిధులు మంజూరు చేయనున్నారు.

హద్దుల ఏర్పాట్లకు త్వరలో టెండర్లు



ఏఎంఆర్‌పీ పరిధిలో ఎంపిక చేసిన చెర్వులకు ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తించి హద్దురాళ్లను ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ రూ.27.18 లక్షలను మంజూరుచేశారు. త్వరలో టెండర్ల ప్రక్రియను చేపడతాం. పారదర్శకంగా పనులు చేస్తాం. వచ్చే వారంలో పనులు ప్రారంభించి, ఆగస్టు నెలాఖరులోగా పూర్తిచేస్తాం. ఈఈల ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేసిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు.

- గంగం శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఈ



నిధుల మంజూరు ఈ చెరువులకే

ఏఎంఆర్‌పీ పరిధిలోని డివిజన్ నెంబర్ 4 నుంచి 7 వరకు గల 9 చెరువులకు తొలివిడతగా నిధులను మంజూరుచేశారు. వీటిలో డివిజన్ 4 పరిధిలోని గుడిపల్లి మండలం ఘనపూర్‌లోని అక్కబావి చెర్వుకు రూ.3.20 లక్షలు, ఇదే మండలంలోని పలుగుచెర్వుకు రూ.3.10 లక్షలను మంజూరు చేశారు. ఐదవ డివిజన్ పరిధి గుర్రంపోడు మండలం కొప్పోలులోని చింతలచెర్వుకు రూ.2.43లక్షలు, కనగల్ మండలంలోని ఊరదక్షిణ చెర్వుకు రూ.3.35లక్షలు, ఆరో డివిజన్ పరిధిలోని నార్కట్‌పల్లి పెద్ద చెరువుకు రూ.3.42 లక్షలు, నల్లగొండ మండలం కొత్తపల్లి వెల్మారాజుకుంటకు రూ.1.40 లక్షలు, ఏడో డివిజన్‌లోని చిట్యాల మండలం వా విలాలచెర్వు, శామతోటబావికుంట, మహలింగం చెర్వులకు కలిపి రూ.3.83 లక్షలు, తిప్పర్తి మండలం కేశరాజుపల్లిలోని మేడి కుంట, అనిశెట్టి దుప్పలపల్లిలోని బొప్పరాజు కుంటలకు కలిపి రూ.3.45 లక్షలు, నకిరేకల్ మండలంలోని ఎర్రకుంట, కల్లంవారికుంట, దండ కుంటలకు కలిపి రూ.3.00లక్షలతో మొత్తం రూ.27.18లక్షల మేరకు ఈఈలు అంచనాలు సమర్పించగా నిధులు మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు.

సాగునీరు అందించే వరకూ పోరాటం

సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

దేవరకొండ, ఆగస్టు 2: డిండి ఎత్తిపోతల, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులను పూర్తిచేసి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీరు అందించేంతవరకు సీపీఎం పోరాటాలు నిర్వహిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండ సీపీఎం కార్యాలయంలో జరిగిన సీపీఎం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి పాలకుల నిర్లక్ష్యం కారణంగా దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలు ఫ్లోరైడ్ సమస్యతో ఇబ్బందులు పడుతుండడంతోపాటు సాగునీటికి నోచలేదన్నారు. సాగునీరులేక బీడు భూములుగా మారాయని, పనులులేక రైతులు, కూలీలు వలస పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజా సమస్యలపై సీపీఎం ప్రజలపక్షాన నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య, కంభాలపల్లి ఆనంద్, నల్ల వెంకటయ్య, రాములు, బిజిలి లింగయ్య, యాదగిరి, నల్ల రామస్వామి పాల్గొన్నారు.

మునుగోడు: సాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారం చూపే డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్ ఆమోదానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మునుగోడు నియోజకవర్గంలోని ఎర్రగోపాల్ స్మారక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్ట్ పనులకు సంబంధించిన పర్యావరణ అనుమతుల ప్రయత్నంలోనే తప్పిదం చేసిందన్నారు. మళ్లీ తప్పిదానికి చోటివ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఈనెల 9న సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, మునుగోడు, గట్టుప్పల్,నాంపల్లి, మర్రిగూడ మండలాల కార్యదర్శులు మిర్యాల భరత్‌కుమార్,అచ్చిన శ్రీను, నాంపల్లి చంద్రమౌళి, మల్లేష్, లింగస్వామి, ముత్యాలు, శ్రీనివాస్, నర్సింహ పాల్గొన్నారు.

కుంగిన 10వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీ

మూసీ ప్రాజెక్ట్ పరిధిలో సరిపడా అందని సాగునీరు



10వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీపై మట్టి కుంగడంతో ఏర్పడిన గండి

కేతేపల్లి, ఆగస్టు 2: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణాలోపం.. వెరసి మూసీ ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వపైగల 10వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీ ఆయకట్టు రైతులకు శాపంగా మారింది. మండలంలోని చీకటిగూడెం, ఉప్పలపహాడ్ గ్రామాలకు చెందిన రైతులకు 400 ఎకరాల పైచిలుకు భూములకు సాగునీటిని అందించేందుకు మూసీ కుడికాల్వ నిర్మించిన నాడు చీకటిగూడెం గ్రామశివారులో 10వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీని ఏర్పాటుచేశారు. దీని పరిధిలో సాగు భూములు ఎక్కువగా ఉండడంతో ఈ డిస్ట్రిబ్యూటరీ కి-ఏ, బీ పేరిట రెండు తూములు ఏర్పాటుచేశారు. నాటి నుంచి గత రెండేళ్ల క్రితం వరకు ఈ రెండు తూముల ద్వారా మూసీ అధికారులు డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని భూములకు సాగునీటిని అందిస్తున్నారు. ఈక్రమంలో గత రెండేళ్ల క్రితం రూ.65కోట్లతో మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ 10వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీకి గల 'ఏ', బీ తూములకు చెందిన సిమెంట్ పైపులను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. పైపుల ఏర్పాటు, మట్టి పనులు నాణ్యతగా లేకపోవడంతో పైపులు వేసిన నాటి నుంచి బీ తూము నుంచి నీరు బయటకు రావడం లేదు. దీంతో 10వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీకి గల 'ఏ' తూము నుంచి వచ్చే నీటిని ఆయకట్టులోని 400 ఎకరాల పైచిలుకు భూములకు రైతులు వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో డిస్ట్రిబ్యూటరీ చివరి ఆయకట్టు భూములకు నీరు అందడంలేదు. మరోవైపు మూసీ కుడి ప్రధాన కాల్వపై డిస్ట్రిబ్యూటరీ ఏర్పాటు చేసిన చోట కట్ట కుంగడంతో కాల్వ కట్ట మీదుగా ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లతో వ్యవసాయ భూములకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



చెత్తా చెదారంతో నిండిన డిస్ట్రిబ్యూటరీ నుంచి కొద్దిగా వస్తున్న నీరు

ఒక్క తూము ద్వారానే నీరు అందాల్సి ఉంది

10వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీకి ఒక తూము ద్వారానే నీరు అందించాల్సి ఉన్నందున, అలాగే అందిస్తున్నాం. గతంలో ఎప్పుడో రైతులు రెండో తూమును ఏర్పాటు చేసుకున్నారు. దాన్ని సైతం కాల్వ మరమ్మతు పనుల్లో భాగంగా బాగు చేయించాం. ఇటీవల మళ్లీ కొంత మేర దెబ్బతిన్నట్లు తెలిసింది. కాంట్రాక్టర్‌తో తిరిగి మరమ్మతు పనులు చేయిస్తాం.

- జి.మమత, ఏఈ, కుడి కాల్వ

రెండు తూముల నుంచి నీరు వచ్చేలా చూడాలి

10వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీకి గల రెండు తూముల నుంచి నీరు వస్తేనే ఆయకట్టులోని 440 ఎకరాల్లో సాగు చేసిన పంటలకు నీరు సరిపోతుంది. ఈ డిస్ట్రిబ్యూటరీ ద్వారా విడుదలయ్యే నీటిని రెండు గ్రామాల రైతులు వినియోగించుకోవాల్సి ఉంది. రెండు తూముల్లో ఒకతూము రెండేళ్లుగా నీటిని అందించకపోవడంతో చివరి ఆయకట్టులో ఉన్న ఉప్పలపహాడ్ రైతులకు నీరు అందడం లేదు. దీంతో ఎగువ, దిగువ రైతులకు నిత్యం గొడవలు జరుగుతున్నాయి. మూసీ అధికారులు డిస్ట్రిబ్యూటరీకి మరమ్మతులు చేసి రెండు తూముల నుంచి నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి.

- కోట వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్

శాకంబరిదేవిగా

అమ్మవారు

ఆషాడమాసం చివరి శుక్రవారం కావడంతో చిట్యాల మండలం నేరడ గ్రామంలోని శ్రీశాంభవిదేవి ఆలయంలో అమ్మవారు శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామునే ఆలయంలో సుప్రభాతసేవతో ఆరంభించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా చింతపల్లి మండలంలోని వేంకటేశ్వరనగర్ శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో దుర్గామాత అమ్మవారు శాకాంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో పూరె లక్ష్మణ్, పురోహితులు పెందోట సత్యానారాయణ, శివకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

- చిట్యాల రూరల్, చింతపల్లి



చిట్యాలలో శాకంబరిదేవిగా అమ్మవారి అలంకారం

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలగిరి, ఆగస్టు 2: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని టిక్కేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సురేష్ శుక్రవారం తెలిపారు. తిరుమలగిరి పరిధి అనంతారం సమీపంలోని టిక్కేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ట్రాక్టర్ యజమానులు గొడిశాల సోమన్న, రెడ్డిమల్ల ప్రభాకర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అనారోగ్యంతో వలస కార్మికుడు మృతి

కట్టంగూరు, ఆగస్టు 2: అనారోగ్యంతో వలస కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామపంచాయతీ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమబెంగాల్ రాష్ట్రం సోనాముఖి జిల్లా బంకురా గ్రామానికి చెందిన దీబాస్ బౌరి(19) అనే వలస కార్మికుడు గత కొంత కాలం నుంచి బతుకుదెరువు కోసం వచ్చి స్థానిక శ్రీ రాఘవేంద్ర ఫెర్రోఅలయస్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 1వ తేదీన కడుపునొప్పి వస్తుందని చెప్పడంతో తోటి కార్మికులు నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. నొప్పి తగ్గకపోవడంతో శుక్రవారం నల్లగొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యాదాద్రి జిల్లాలో 'వైఫ్‌స్వాపింగ్' కలకలం

భువనగిరి టౌన్, ఆగస్టు 2 : భార్యలను పరస్పర అంగీకారంతో ఇతరులతో పంచుకోవడం(వైఫ్‌స్వాపింగ్) యాదాద్రిభువనగిరి జిల్లాలో చర్చనీయాంశమైంది. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన రెండు జంటలు జిల్లా కేంద్రమైన భువనగిరి పట్టణ శివారులో అద్దె ఇళ్లలో ఉండేవారు. ఈ జంటలు పరస్పర అంగీకారంతో భార్యలను(వైఫ్ స్వాపింగ్) మార్చుకునేవారు. ఈ జంటలు తమ ఇళ్లకు సమీపంలో ఉత్తర భారతదేశ ప్రాంతానికి చెందిన ఓ కార్మికుడి కుటుంబాన్ని పరిచయం చేసుకుని తమ రొంపిలోకి లాగాయి. పరిస్థితులకు అనుగుణంగా ఆ మూడు ఇళ్లలోనే పగలురాత్రీ తేడా లేకుండా వైఫ్ స్వాపింగ్‌కు పాల్పడుతుండేవారు. ఈ క్రమంలో మూడు జంటల్లో ఓ వ్యక్తి తన భార్య చెల్లెలిని ఇందులోకి లాగాలని అందరినీ ఒప్పించాడు. అయితే ఆ కుట్ర తెలియని ఆమె ఇటీవల అక్క ఇంటికి వచ్చింది. అక్కాచెల్లెలు కలిసి కలిసి మరో జంట ఇంటికి వెళ్లారు. అయితే ఆ చెల్లెలు గతంలో మెడికల్ షాప్‌లో పనిచేసిన అనుభవంతో ఆ ఇంటిలో కనిపించిన మందులను ఎవరు వాడుతున్నారని ప్రశ్నించింది. దీంతో మేం వాడుతున్నామని ఆ ఇంటి ఇల్లాలు చెప్పింది. అనంతరం ఇంటికి వెళ్లాక ఆ జంట వాడుతున్నది సుఖవ్యాధులకు సంబంధించిన మందులుగా, నిర్లక్ష్యం చేస్తే హెచ్‌ఐవీగా రూపాంతరం చెందుతుందని, జాగ్రత్తగా ఉండాలని అక్కను హెచ్చరించి చెల్లెలు అదే రోజు ఊరికి వెళ్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న రెండు జంటలు అద్దె ఇళ్లను ఖాళీ చేసి భువనగిరి విడిచివెళ్లాయి. మరో జంట కూడా త్వరలోనే సొంత ప్రదేశానికి వెళ్లి వైద్య చికిత్సలు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

సమయానికి కళాశాలకు వెళ్లలేకపోతున్నాం

బస్సులు ఆపాలని విద్యార్థుల ధర్నా ● గంటపాటు నిలిచిన వాహనాలు



మోటకొండూరు మండలం కాటేపల్లిలో రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు

మోటకొండూరు, ఆగస్టు 2: ఆర్టీసీ బస్సులు ఆపకపోవటంతో సమయానికి కళాశాలకు వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు రాస్తారోకో చేశారు. శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. రాయగిరి-మోత్కూరు ప్రధానరహదారి వెంట ఉన్న కాటేపల్లి గ్రామానికి చెందిన 30మంది విద్యార్థులు భువనగిరిలో ఇంటర్, డిగ్రీ చదువుతున్నారు. కళాశాలలు ప్రారంభమై రెండునెలలుగా భువనగిరి వైపు వెళ్లే బస్సులు ఆపడంలేదని నిరసన వ్యక్తంచేస్తూ రహదారిపై ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ సమయానుకూలంగా రెండు బస్సులు నడపడంతో పాటు, అన్ని బస్సులను కాటేపల్లి స్టేజీ వద్ద ఆపాలని డిమాండ్ చేశారు. గంటపాటు ధర్నాతో రెండువైపులా కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్‌ను పోలీసులు ఫోన్‌లో సంప్రదించగా వారంలోగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, విద్యార్థులు జువ్వగాని శ్రీరామ్, ఎండీ.అన్వర్, మల్లెల శ్రీహరి, సాయికుమార్, వరికుప్పల ఉమారాణి, వర్ష, సౌజన్య పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లాలో వేర్వేరు చోట్ల ఇద్దరి హత్య

● అప్పు తీర్చలేక ఒంటరి మహిళ హత్య
● ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలతో పరార్

నార్కట్‌పల్లి, ఆగస్టు 2: తల్లి చేసిన అప్పు తీర్చలేక ఓ కుమారుడు ఒంటరి మహిళను కడతేర్చి ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలతో ఉడాయించాడు. శుక్రవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంలలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ క్రాంతికుమార్, గ్రామస్థులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. బ్రాహ్మణవెల్లెంలకు చెందిన రెబ్బ జానకమ్మ(72)కు చౌటుప్పల్‌కు చెందిన సత్తయ్యతో వివాహం కాగా, వారికి సంతానం లేదు. దీంతో సత్తయ్య రెండో వివాహం చేసుకుని చౌటుప్పల్‌లో ఉంటున్నాడు. ఇద్దరి మధ్య వివాదాల నేపథ్యంలో జానకమ్మ 33ఏళ్ల క్రితమే బ్రాహ్మణవెల్లెంలకు వచ్చి తల్లితో కలిసి అద్దె ఇంట్లో ఉంటోంది. భర్త సత్తయ్య ఐదేళ్ల క్రితం మృతిచెందగా, మూడేళ్ల క్రితం తల్లి మృతిచెందటంతో ఒంటరిగానే ఉంటోంది. జీవనోపాధి కోసం గ్రామంలో మగ్గాల వద్ద రంగులు అద్దే పనికి వెళుతూ ఉండేది. బ్రాహ్మణవెల్లెంలలో ప్రస్తుతం నివసిస్తున్న ఇంటినే కొనుగోలు చేసింది. తన కష్టంతో సంపాదించి దాచుకున్న డబ్బులను వడ్డీలకు ఇచ్చేది. ఇందులో భాగంగానే సుమారు లక్ష రూపాయలు ఇదే గ్రామానికి చెందిన కొలను రంగనాయకమ్మకు అప్పుగా ఇచ్చింది. రంగనాయకమ్మ కుమారుడు కార్తీక్ గ్రామంలోని మునుగోడు రోడ్డులో ఉన్న పెట్రోలు బంకు వద్ద కొన్నాళ్లపాటు హోటల్ నిర్వహించి ప్రస్తుతం సొంతంగా మగ్గం నడుపుతున్నాడు. తీసుకున్న అప్పు త్వరగా చెల్లించాలని జానకమ్మ రంగనాయకమ్మను తరచూ అడుగుతోంది.



జానకమ్మ(ఫైల్)

హత్యచేసి ఆభరణాలతో పరార్..

ప్రతీ రోజూ ఉదయాన్నే నిద్ర లేచే జానకమ్మ 7 గంటలు దాటినా లేవకపోవడంతో ఇంటి పక్కనే ఉన్న చెరుపల్లి అండాలు, జయసింహ వచ్చి తలుపుతట్టారు. ఆమె పిలిచినా పలకకపోవడంతో వేరే గుమ్మం వద్దకు వెళ్లగా ఆ సమయంలో రంగనాయకమ్మ కుమారుడు కొలను కార్తీక్ జానకమ్మ ఇంటి లోపలి నుంచి బయటకు వచ్చాడు. నువ్వెందుకు జానకమ్మ ఇంట్లోకి వచ్చావు.. జానకమ్మ ఏదని అడుగుతుండగానే ఆమె ఇంట్లో నిద్రిస్తోందని చెప్పి ద్విచక్రవాహనంపై పరారయ్యాడు. వారు ఇంటి లోపలికి వెళ్లి చూసేసరికి జానకమ్మ విగతజీవిగా పడిఉంది. అప్పు తీర్చాల్సివస్తుందని ఆమెను హత్యచేసి ఆమె ఒంటిపై ఉన్న సుమారు 10 తులాల బంగారు ఆభరణాలను కూడా కార్తీక్ తీసుకుని పరారైనట్లు గ్రామస్థులు అనుమానిస్తున్నారు. గ్రామస్థుల ద్వారా సమాచారం అందుకున్న నార్కట్‌పల్లి సీఐ, ఎస్‌ఐలు నాగరాజు, క్రాంతికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రత్యక్ష సాక్షులను విచారించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మృతురాలు జానకమ్మ సవతి కుమారుడు రెబ్బ యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. నిందితుడిగా అనుమానిస్తున్న కార్తీక్‌దిగా భావిస్తున్న హెల్మెట్‌ను పోలీసులు జానకమ్మ ఇంటి వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన కార్తీక్ ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. త్వరలో నిందితుడిని పట్టుకుంటామన్నారు.

తండ్రి మరొకరితో సహజీవనం చేస్తున్నాడని..

గుర్రంపోడు, ఆగస్టు 2: తండ్రి మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని ఆగ్రహించిన కుమారుడు రోకలిబండతో విచక్షణా రహితంగా కొట్టడంతో మృతిచెందాడు. గురువారం అర్ధరాత్రి నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం చేపూరు గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ శివప్రసాద్, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుర్రంపోడు మండలం చేపూరు గ్రామానికి చెందిన అయితగోని కొండయ్య (62) వ్యవసాయ పనులతో పాటు సీజన్‌లో కల్లు గీసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొండయ్యకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు శంకర్‌కు వివాహంకాగా కుమారుడు, కుమార్తె ఉన్నారు. తండ్రితోపాటే వ్యవసాయం చేసుకుంటూ ఒకే ఇంట్లో ఉంటున్నారు.



కొండయ్య(ఫైల్)

కొండయ్య భార్య నాలుగేళ్ల క్రితం మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన మరో మహిళతో కొద్ది కాలంగా సహజీవనం చేస్తున్నాడు. గురువారం ఆ మహిళకు సంబంధించిన పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన కొండయ్యతో కుమారుడు అయితగోని శంకర్ గొడవపడ్డాడు. మహిళతో సహజీవనం చేస్తున్నావని, నిన్ను చంపుతానని బెదిరించాడు. దీంతో కొండయ్య సహజీవనం చేస్తున్న మహిళ ఇంటికి వెళ్లి భోజనం చేసి అక్కడే నిద్రించాడు. శంకర్ ఆగ్రహంతో ఆమె ఇంటికి వెళ్లి తండ్రితో గొడవపడి అక్కడున్న రోకలిబండతో విచక్షణారహితంగా కొట్టి పరారయ్యాడు. తీవ్రగాయాలైన కొండయ్యను చుట్టుపక్కల వారు 108లో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కొండయ్య పెద్ద కుమార్తె పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



నర్సయ్య(ఫైల్)

వలిగొండ, ఆగస్టు 2 : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం నర్సయ్యగూడెం వద్ద కారు ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన వల్లెపు నర్సయ్య(60) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం వలిగొండ మండలకేంద్రానికి మోపెడ్‌పై వచ్చి స్వగ్రామానికి వెళ్తున్నాడు. నర్సయ్యగూడెం స్టేజీ దాటాక ఎదురుగా అజాగ్రత్తగా వచ్చిన కారు నర్సయ్య మోపెడ్ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. నర్సయ్య కుమార్తె మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చండూరులో ఆటో బోల్తాపడి బాలుడు..



అనిల్(ఫైల్)

చండూరు, ఆగస్టు 2 : కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తాపడిన ఘటనలో బాలుడు మృతి చెందాడు. నల్లగొండ జిల్లా చండూరు పట్టణంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాంపల్లి మండలం నేరళ్లపల్లి గ్రామానికి చెందిన సుమారు 12మంది కూలీలు బత్తాయిలు ఏరడానికి గుర్రంపోడు మండలం చామలోనిబావి గ్రామానికి ఆటోలో వెళ్లి తిరిగి వస్తుండగా చండూరు మునిసిపల్ కేంద్రంలో ఆటో బోల్తా పడింది. అయితే ఆటోలో నేరళ్లపల్లి గ్రామానికి చెందిన కడారి శ్రీను, నాగమ్మ దంపతులతో పాటు కుమారుడు అనిల్(15)లో ప్రయాణిస్తున్నాడు. ఈ ఘటనలో డ్రైవర్ పక్కనే కూర్చున్న కడారి అనిల్(15) తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అనిల్‌తో పాటు మరో ఆరుగురికి తీవ్రగాయాలు కాగా నలుగురిని అంబులెన్స్‌లో నల్లగొండ ఆసుపత్రికి తరలించారు. మరో ఇద్దరిని స్థానిక ఆసుపత్రిలో తరలించి చికిత్స అందించారు. మరికొంత మందికి స్వల్పగాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కళ్ల ముందే కుమారుడు మృతి చెందడం, వారికి కూడా తీవ్రగాయాలుకావడంతో వారు స్పృహతప్పిపోయారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేని ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 2 : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ నరేష్ తెలిపారు. మండలంలోని ఆలగడప గ్రామానికి చెందిన ఇంద్రపల్లి సైదులు(42) సొంతపని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. పని ముగించుకొని ఇంటికివెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కోదాడ - జడ్చర్ల రహదారిపై కారు అదుపుతప్పి ఢీకొట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. సైదులను చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండజిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ సైదులు శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. సైదులు సోదరుడు సోమయ్య ఫిర్యాదుమేరకు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ వీరాంజనేయులుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

సహాయక చర్యల్లో పాల్గొని.. తీవ్ర గాయాలపాలై...

● తాటిచెట్టుపై వృద్ధ గీత కార్మికుడి ఆత్మహత్య
● దింపే క్రమంలో ఓ వ్యక్తిపై పడిన మృతదేహం
● తీవ్రగాయాలతో వ్యక్తి ఆసుపత్రిపాలు

మునగాల, ఆగస్టు 2: సహాయకచర్యల్లో పాల్గొన్న ఓ వ్యక్తి 20అడుగుల ఎత్తునుంచి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. శుక్రవారం సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మునగాల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన దేశగాని వెంకటేశం(70) కల్లు గీస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్యకు మతిస్థిమితం లేదు. వీరికి సంతానం లేకపోవడంతో మానసిక ఒత్తిడితో అనారోగ్యం పాలయ్యారు. కొద్దిరోజులు మానసిక ఒత్తిడితో ఉన్న వెంకటేశం శుక్రవారం మోకు ముస్తాద్‌తో తాటిచెట్టు ఎక్కి చెట్టు పైభాగాన బలమైన మట్టకు టవల్‌తో మెడకు కట్టుకుని మోకు ముస్తాద్‌లను కిందికి వదలడంతో మృతి చెందాడు. అటుగా వెళ్లిన గ్రామస్థులు గమనించి బంధువులకు సమాచారం అందించడంతో వెంకటేశం మృతదేహాన్ని కిందికి దింపేందుకు గ్రామానికి చెందిన గీత కార్మికుడు కీర్తి నర్సయ్య చెట్టు పైకి ఎక్కగా, మరో వ్యక్తి జూలూరి నాగరాజు చెట్టు సగం దూరం ఎక్కి ఉన్నాడు. ఈ క్రమంలో మృతదేహానికి ఉన్న తాడు తెగి మృతదేహం చెట్టు మధ్యలో ఉన్న నాగరాజు మీద పడింది. దీంతో 20 అడుగుల ఎత్తునుంచి నాగరాజు, మృతదేహం కిందపడిపోయారు. దీంతో తీవ్రగాయాలైన నాగరాజును కోదాడ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. వెంకటేశం బంధువు దేశగాని నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



చెట్టు సగం వరకు ఎక్కిన జూలూరి నాగరాజుపై పడుతున్న వెంకటేశం మృతదేహం

పురుగుల మందు తాగి ఓ వ్యక్తి..

తిరుమలగిరి, ఆగస్టు 2 : క్రిమిసంహారక మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో జరిగింది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన గిరిబాబు మునిసిపల్ కేంద్రంలోని సుప్రజ ఎస్టేట్‌లో పురుగుల మందు తాగి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరిలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రియుడి వేధింపులతో వివాహిత ఆత్మహత్య

నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో ఘటన



అనిత(ఫైల్)

నకిరేకల్, ఆగస్టు 2: ప్రియుని వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం నోముల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన అనిత(28)కు నోముల గ్రామానికి చెందిన వెల్మకంటి శ్రీనుతో పదేళ్ల క్రితం వివాహంకాగా, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అనిత కిరాణ దుకాణంతో పాటు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. అదే గ్రామానికి చెందిన టేకుల రాజేష్‌తో సాన్నిహిత్యంగా ఉండటంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం గ్రామస్థులు ఇరువురిని మందలించి నచ్చజెప్పారు. కొద్దిరోజులుగా అనితకు రాజేష్ ఫోన్ చేసి వేధించడం మొదలు పెట్టాడు. మళ్లీ తన దగ్గరికి రావాలని తరచూ ఫోన్ చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న కొందరు పెద్ద మనుషులు రాజేష్‌ను మందలించారు. అయినా వినకుండా గురువారం రాత్రి మళ్లీ అనితకు ఫోన్ చేశాడు. శుక్రవారం ఉదయం పెద్ద మనుషుల వద్దకు రావాలని వేధించడంతో మనస్తాపానికి గురైంది. అనిత ఇంట్లో తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు మృతదేహాన్ని రాజేష్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగటంతో ఎస్‌ఐ గోపికృష్ణ హుటాహుటిన వెళ్లి ఎలాంటి ఘర్షణ జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజేష్ లేకపోవడంతో మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాత్రి 10 గంటల వరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించలేదు. ఈ విషయంపై సీఐ రాజశేఖర్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఆయన తెలిపారు.

ఆండాళ్ అమ్మవారికి వైభవంగా ఊంజల్ సేవ

భువనగిరి అర్బన్, ఆగస్టు 2 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణ పుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వయంభూలను మేల్కొలిపిన ఆచార్యులు పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీ దళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో ఆండాళ్ అమ్మవారిని అలకరించి సేవలో తీర్చిదిద్దారు. అనంతరం మంగళనీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు, యాగశాలలో చండీయాగం చేపట్టారు. ఆలయన ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.10,24,087 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



అద్దాల మండపంలో అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మాజీ ఉపప్రధానార్చకుడికి ఘనసన్మానం

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఉపప్రధానార్చకుడిగా ఉద్యోగ విరమణ పొందిన పీ భాస్కరాచార్యులు దంపతులను ఘనంగా సన్మానించారు. ధన్వంతరి వేదికపై జరిగిన కార్యక్రమంలో వేద ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త మాధవశేషస్వామి, కాటూరి శ్రీనుస్వామి, రామసీత, గట్టు నరసింహాచార్యులు, కేశవచార్యులు, అపోలో వెంకటాచార్యులు, మోటపల్లి గిరిస్వామి, రామాంజనేయచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మాటల్లో పెట్టి.. ఆభరణం కొట్టేసి..

సీసీ టీవీలో చూసి వెంటబడిన జ్యువెల్లరీ షాప్ యజమాని

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 2 : ఆటోలో వచ్చిన ఓ మహిళ బంగారు నగలు కొనుగోలు చేస్తున్నట్లు నటించి చోరీకి యత్నించింది. ఈ సంఘటన నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలోని పెద్దబజారులో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బురఖా ధరించిన మహిళ భవాని జ్యువెలరీ షాపులోకి వెళ్లింది. ఆభరణాలు పరిశీలిస్తూ సేల్స్ ప్రమోటర్లను మాటల్లో పెట్టి బేరం ఆడింది. అప్పటికే దుకాణంలో వినియోగదారుల రద్దీ అధికంగా ఉండడంతో సేల్స్‌ప్రమోటర్లు బిజీగా ఉండడాన్ని గమనించిన మహిళ రెండు బంగారు ఆభరణాలను తస్కరించి ఆటోలో పారిపోయేందుకు ప్రయత్నించింది. మహిళ చోరీకి పాల్పడుతుండగా రికార్డైన సీసీ టీవీఫుటేజీని షాపు యాజమాని గుర్తించి కేకెపెట్టాడు. దీంతో స్థానికులు ఆటోను అటకాయించారు. దీన్ని గమనించిన ఆటోడ్రైవర్ పారిపోగా, సదరు మహిళ స్థానికులకు చిక్కింది. అనంతరం జ్యువెలరీ షాపులోకి తీసుకెళ్లి ఆమెను తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు లభ్యం కావడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. నిందితురాలిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పోలీసుల అదుపులో ఉన్న సదరు మహిళ పట్టణంలోని సీతారాంపురం కాలనీ వాసిగా స్థానికులు తెలిపారు. కాగా ఈ సంఘటనపై విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

నేరేడుచర్లలో పట్టపగలు చోరీ

నేరేడుచర్ల, ఆగస్టు 2: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని పట్టపగలు చోరీజరిగింది. విద్యానగర్‌కు చెందిన రావిరాల భ్రమరాంబ శుక్రవారం మధ్యాహ్నం టాబ్లెట్లు తెచ్చుకునేందుకు ఇంటికి తాళం వేసి మిర్యాలగూడకు వెళ్లింది. తిరిగి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా 36 తులాల వెండి, రూ.10వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించింది. డయల్-100 ఫోన్ చేయడంతో పోలీసులు వచ్చి వివరాలు సేకరించినట్లు ఆమె తెలిపింది.

దొంగల గుర్తింపు

కోదాడ రూరల్, ఆగస్టు 2 : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండ గ్రామంలోని చోరీలకు పాల్పడుతున్న దొంగలను పోలీసులు గుర్తించారు. వారికి సంబంధించిన ఫొటోలను రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కేఎల్ఆర్ కాలనీలో 45 రోజుల వ్యవధిలో ఐదు చోరీల్లో విలువైన వస్తువులు, డబ్బు, బంగారం అపహరణకు గురయ్యాయి. కాలనీ వాసులు ఫిర్యాదుతో విచారించిన పోలీసులు దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులను సీసీ కెమెరాలో గుర్తించామని, వారి ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా వారి ఫొటోలను సేకరించి విడుదల చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఇరువురు వ్యక్తులు పట్టణంతో పాటు పలు గ్రామాల్లో దొంగతనాలు చేస్తున్నారని, ఎవరైనా వీరిని గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి కోరారు.



పోలీసులు విడుదల చేసిన దొంగల చిత్రాలు

ఇరవై అడుగుల కొండచిలువ

అర్వపల్లి, ఆగస్టు 2: సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం అడివెంల గ్రామంలో చెరువులో ఊతతో చేపలు పడుతున్న వ్యక్తికి 20 అడుగుల కొండచిలువ లభించింది. శుక్రవారం గ్రామానికి చెందిన సైదులు ఊతతో చేపలు పడుతున్నాడు. ఒక్కసారిగా 20 అడుగుల కొండచిలువ ఊతలోకి పడడంతో సైదులు ఉలిక్కిపడ్డాడు. కొండచిలువను గట్టిగా పట్టుకొని గ్రామస్థులు బయటికి తీశారు. అప్పటికే ఊపిరాడక కొండచిలువ మృతి చెందింది. కొండచిలువను చూసేందుకు గ్రామస్థులు ఆసక్తి చూపారు.



చెరువులో ఊతకు చిక్కిన కొండచిలువ



వరదకాల్వ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

వరద కాల్వలో చెట్లను తొలగించాలి

మాడ్గులపల్లి, ఆగస్టు 2: వరదకాల్వలో చెట్లను తొలగించి వెంటనే నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని వరదకాల్వలో పేరుకపోయిన చెట్లను, ముళ్లకంపలను పరిశీలించి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. గత వేసవికాలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా వరదకాల్వలో పేరుకపోయిన చెట్లను, ముళ్లకంపలను తొలగించి ఉంటే ప్రస్తుతం సాగర్ నుంచి వరదకాల్వలోకి నీరు త్వరగా చేరి చివరి ఆయకట్టు వరకు నీరు చేరేదన్నారు. వరదకాల్వ కింద రైతులు పెద్దఎత్తున నారుమడులు పోసుకున్నారని, వెంటనే అధికారులు స్పందించి చెట్లను తొలగించి నీరు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో దేవిరెడ్డి మల్లారెడ్డి, శ్రీను, శ్రీకర్, సీతారాంరెడ్డి, చంద్రయ్య, భూపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సైదులు, నాగయ్య, పరుశురాములు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి : పల్లా



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

దేవరకొండ, ఆగస్టు 2: జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ, డిండి, నక్కలగండి, పెండ్లిపాకల పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి సాగునీరు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, నర్సింహారెడ్డి పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కమీషన్ల కోసం కాళేశ్వరానికి అధిక నిధులు కేటాయించారని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిచేసి సాగునీరు అందించాలని కోరారు. నూతనంగా రేషన్‌కార్డులను, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధానకార్యదర్శి నర్సింహ, దేవేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కేశవరెడ్డి, రామస్వామి, ఆంజనేయులు, వెంకట్రాములు, పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గట్టుప్పల్, ఆగస్టు 2: చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చేనేత కార్మిక సంఘం నాయకులు ఇడం కైలాసం, అందె రాము డిమాండ్ చేశారు. గట్టుప్పల్ మండలకేంద్రంలో శుక్రవారం చేనేత కార్మికుల సమస్యలపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాములుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రారంభించిన చేనేత త్రిఫ్ట్, బీమా, చేనేతమిత్ర, నూలు సబ్సిడీ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. చేనేత రుణాలు మాఫీ చేసి, కార్మికులకు పని కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో చేనేత నాయకులు ఇడం కైలాసం, కార్మిక సంఘం అధ్యక్షుడు అందె రాము, కర్నాటి వెంకటేశం, గడ్డం కృష్ణయ్య, నామిని స్వామి, రాపోలు సత్తయ్య, చేరుపల్లి రమేష్ నేత, గంజి పెద్దులు, అంజయ్య, రమేష్, పున్న నర్సింహ, గంజి శంకర్, పాండు, నరహరి, కర్నాటి అశోక్, శ్రీశైలం, శ్రీహరి పాల్గొన్నారు.

ఎడమకాల్వకు మరమ్మతులు నిర్వహించాలి

మిర్యాలగూడ టౌన్, జూలై 2: సాగర్ ఎడమకాల్వకు మరమ్మతులు చేపట్టాలని కిసాన్‌సెల్ జాతీయ కార్యవర్గసభ్యుడు గోలి మదుసూధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నెస్పీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎడమకాల్వకు మరమ్మతులు చేపట్టకుండా నీటిని విడుదల చేస్తే నీరంతా వృథా అవుతుందన్నారు. రైతులపై ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు సాధినేని శ్రీనివాసరావు, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు సీతారాంరెడ్డి, సరిత, హన్మంతరెడ్డి, రవిబాబు పాల్గొన్నారు.

'హామీ మేరకు రుణమాఫీ చేయాలి'

కేతేపల్లి, ఆగస్టు 2: ఎన్నికల హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని మహిళా రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కందాళ ప్రమీల డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 7 శాతం వడ్డీ చెల్లించి అప్పు రెన్యువల్ చేయించుకుంటేనే రుణమాఫీ అమలుచేస్తామని బ్యాంకర్లు కొర్రీలు పెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రైతులందరినీ రుణ విముక్తులను చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కోట లింగయ్య, నాయకులు రాజు, సుధీర్ పాల్గొన్నారు.

టీచర్ల చిరకాల స్వప్నాన్ని నెరవేర్చిన ప్రభుత్వం

మిర్యాలగూడ, ఆగస్టు 2: ఉపాధ్యాయుల 15 ఏళ్ల కలను ప్రభుత్వం నెరవేర్చిందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డితో నిర్వహించిన సమావేశానికి వెళ్తున్న వాహనాలకు ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించారని అన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రహించిన సీఎం రేవంత్‌రెడ్డి 30వేల మందికి పదోన్నతులు కల్పించి అండగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీనాయక్, కరుణాకర్, టీసీ ఉద్యోగుల సంఘం నాయకులు పరమేష్, కాంగ్రెస్ నాయకులు తమ్మడబోయిన అర్జున్, కొమ్ము శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వ మరమ్మతు పనులు ప్రారంభం

కనగల్, ఆగస్టు 2: మండల పరిధిలోని ఏఎమ్మార్పీ డి25, 6ఎల్ కాల్వ మరమ్మతు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి ప్రారంభించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అనూప్‌రెడ్డి మాట్లాడుతూ డి25 కాల్వ పరిధిలోని జీఎడవల్లి, బండమీదిగూడెం, కుమ్మరిగూడెం. బుడమర్లపల్లి గ్రామాలకు సంబంధించిన వ్యవసాయ భూములు, చెరువులు కుంటలు ఉన్నాయని వివరించారు. కాల్వ మరమ్మతు పనులతో ఆయా గ్రామాల చెరువులకు నీటి లభ్యతకు ఇబ్బందులు తొలగుతాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొర్వి శంకర్, బొడ్డుపల్లి శ్రీను పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కనగల్: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా పశుసంవర్ధక శాఖ ఏడీ సదానందం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ప్రత్యేకాధికారిగా ఉన్న శ్రీనివాస్‌ను రంగారెడ్డి జిల్లాకు ప్రభుత్వం బదిలీ చేయడంతో ఆయన స్థానంలో సదానందాన్ని నియమించింది.

సీడీపీవోగా లావణ్యకుమారి

మునుగోడు: మునుగోడు సీడీపీవోగా లావణ్యకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొన్నాళ్లుగా ఇక్కడ విధులు నిర్వర్తించిన జి.కవిత రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి ప్రాజెక్ట్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో జిల్లాలోని చింతపల్లి ప్రాజెక్ట్ నుంచి లావణ్యకుమారి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆమెకు ఏసీడీపీవో వెంకటమ్మ, సూపర్‌వైజర్లు నాగమణి, శివేష, రోజా, సుజాత, యాదమ్మ ఉద్యోగులు కలిసిపుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

● మాజీ సర్పంచుల అరెస్ట్ అప్రజాస్వామికం



వేములపల్లిలో స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ సర్పంచులు

వేములపల్లి, కట్టంగూరు, డిండి, కనగల్, ఆగస్టు 2: ఆరు నెలలుగా మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు సన్నద్ధమైన తమను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని పలువురు మాజీ సర్పంచులు అన్నారు. పెండింగ్ బిల్లలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన చలో అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో శుక్రవారం తాజా మాజీ సర్పంచులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచుల సంఘం నాయకులు మాట్లాడుతూ ఆరు నెలలుగా మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదని ఆరోపించారు. సర్పంచులుగా తమ సొంత గ్రామాలను అభివృద్ధి పథంలో నడపాలనే తలంపుతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగంగా లక్షలాది రూపాయలను ఖర్చు చేసినట్లు తెలిపారు. తమ పదవీకాలం పూర్తయినా ప్రభుత్వం నాటి పెండింగ్ బిల్లులను అందించకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయమై ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా ఫలితం శూన్యంగా ఉండడంతోనే నిరసన కార్యక్రమానికి పూనుకున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం సర్పంచులను ఆర్థిక ఊబిలోకి నెట్టకుండా వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతున్న మాజీ సర్పంచులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

● వేములపల్లిలో సర్పంచుల సంఘం జిల్లా నాయకుడు చిర్ర మల్లయ్యయాదవ్ మాట్లాడుతూ సర్పంచులకు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, కర్ర ఇంద్రారెడ్డి, మారుతి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● కట్టంగూరులో అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచులు గుర్రం సైదులు, సంజయ్, సైదిరెడ్డి, పనస సైదులు, బి.యాదగిరి, సిరిగిరెడ్డి శేఖర్‌రెడ్డి, వనం సైదులు తదితరులు ఉన్నారు.

● డిండిలో మాజీ సర్పంచులు పొనుగోటి రవీందర్‌రావు, కవిత, చంద్రయ్యలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికమని అన్నారు.

● కనగల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచులు పగిళ్ల యాదయ్య, ఆదిమళ్ల లింగయ్య, సింగం కోటేష్, చింతల యాదగిరి, అంజమ్మరాంచంద్రం, కళావతి భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

న్యాయబద్ధమైన పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ



నల్లగొండలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



శాలిగౌరారంలో మంద కృష్ణ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మూడు దశాబ్దాల పాటు అలుపెరగని పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్ మాదిగ, అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్, దళిత సంఘాల ఐక్యకార్యాచరణ సమితి చైర్మన్ పెరిక కరణ్‌జయరాజ్‌లు అన్నారు. శుక్రవారం జిల్లాలోని పలు మండలాల్లో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు నిర్వహించారు. స్వీట్లు పినిపించుకున్నారు. బాణసంచా కాల్చారు

● నల్లగొండ పట్టణంలో ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్, దళిత సంఘాల ఐక్యకార్యాచరణ సమితి చైర్మన్ పెరిక కరణ్‌జయరాజ్‌లు అన్నారు. కోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ డీఈవో కార్యాలయం ఎదుట గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా చేస్తున్న పోరాటానికి నిజమైన సార్థకత లభించిందన్నారు. కోర్టు తీర్పుకు కట్టుబడి ప్రభుత్వం కూడా వీలైనంత త్వరగా చట్టబద్ధత కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పిల్లి రామరాజుయాదవ్, వివిధ కుల సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు వంటిపాక యాదగిరి, వడ్డెబోయిన సైదులు, శ్రీకాంత్, ప్రసాద్, నర్సింహ, ఏడుకొండలు, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

● మంత్రి క్యాంపు కార్యాలయంలో మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● చింతపల్లిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పూరె లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆయన వెంట కొండూరి పవన్‌కుమార్, మద్దెల కృష్ణగౌడ్, పడకంటి శివ పాల్గొన్నారు.

● దేవరకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మక ఘట్టమని, 30 సంవత్సరాల ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వస్కుల సుధాకర్, పట్టణ అధ్యక్షుడు అంజయ్యయాదవ్ తెలిపారు.

● శాలిగౌరారంలో ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు బోడ సునీల్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహం చౌరస్తాలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో బట్ట శ్రీనివాస్, బోడ నర్సయ్య, బాకీ వెంక న్న, బోడ అరుణ్, మామిడి ఎల్లయ్య, బట్ట సైదులు, బట్ట అనిల్, వేముల సాయి, సన్నీ, సందీప్ పాల్గొన్నారు.

అమ్మనబోలు మండలాన్ని ఏర్పాటు చేయాలి : బీజేపీ

నార్కట్‌పల్లి, ఆగస్టు 2: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలోపు అమ్మనబోలును మండల కేంద్రంగా ప్రకటించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని అమ్మనబోలులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికార పార్టీ నాయకులు మండల ఏర్పాటుకు చొరవ చూపాలని, లేనిచో బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం దఫాల వారీగా చేయడం సరైంది కాదన్నారు. చేనేత కార్మికులకు సంబంధించిన త్రిఫ్ట్ పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేయాలని చేనేతమిత్ర పథకం కొనసాగించాలని అన్నారు. కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఎడమ పురుషోత్తంరెడ్డి తల్లి చనిపోగా ఆ కుటుంబాన్ని వర్షిత్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొర్వి శంకర్, మండల చేనేత కన్వీనర్ పోచం వెంకటేశ్వర్లు, పాల్వాయి భాస్కర్‌రావు, రాపోలు సంతోష్, వల్లాజి శివ, ప్రకాశ్‌రెడ్డి, రమేష్, శ్రీపతి రాకేష్ తదితర బీజేపీ కార్యకర్తలు ఉన్నారు.

వైభవంగా కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 2: మాస శివరాత్రి సందర్భంగా పట్టణంలోని తులసీనగర్ శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం విశాలాక్షి సహిత కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకస్వాములు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలో స్వామి అమ్మవార్లను అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు. భక్తులు హాజరై కల్యాణాన్ని కన్నులారా తిలకించి పరవశం పొందారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కుశలయ్య, చంద్రశేఖర్, అర్చకస్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. పరమేశ్వరునికి రుద్రాభిషేకాలు నిర్వహించారు.

'స్వచ్ఛదనం, పచ్చదనం'ను విజయవంతం చేయాలి

దేవరకొండ, ఆగస్టు 2: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహించనున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి శ్రీలక్ష్మీ, ఎంపీడీవో నీలిమ అన్నారు. దేవరకొండ ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న తాగునీరు, వర్షపునీటిని ఒడిసిపట్టడం, గుంతలు పూడ్చడం, మురికినీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించడం, వీధి కుక్కలపై దృష్టి సారించడం, గ్రామాల్లో పారిశుధ్యం పాటించడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు. గ్రామపంచాయతీల్లో ఈ నెల 3వ తేదీన సమావేశాలు ఏర్పాటు చేసుకొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు సూచించారు. సమావేశంలో ప్రత్యేక అధికారులు కరుణసాగర్, రాంచంద్రం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వరదకాల్వలో చెట్లను తొలగించాలి

మాడ్గులపల్లి, ఆగస్టు 2: వరదకాల్వలో చెట్లను తొలగించి వెంటనే నీటిని విడుదల చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని వరదకాల్వలో పేరుకుపోయిన చెట్లను, ముళ్లకంపలను శుక్రవారం పరిశీలించి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. వేసవిలో చెట్లను, ముళ్లకంపలను తొలగించి ఉంటే ప్రస్తుతం సాగర్ నుంచి వరదకాల్వలోకి నీరు త్వరగా చేరి చివరి ఆయకట్టు వరకు నీరు చేరేదని అన్నారు. అధికారులు స్పందించి వరదకాల్వలోని చెట్లను తొలగించి నీరు సజావుగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవిరెడ్డి మల్లారెడ్డి, శ్రీను, శ్రీకర్, సీతారాంరెడ్డి, చంద్రయ్య, భూపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సైదులు, నాగయ్య, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మపరిరక్షణ కోసం కృషి చేయాలి



శ్రీధర్‌స్వామిని సన్మానిస్తున్న ట్రస్టు చైర్మన్, సభ్యులు

చింతపల్లి, ఆగస్టు 2: సమాజంలోని ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణ కృషి చేయాలని ముక్కామాల ఆశ్రమ పీఠాధిపతి శ్రీధర్‌స్వామి పేర్కొన్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ షిర్డీసాయిబాబా దేవాలయంలో శుక్రవారం సాయినాథున్నీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సాయినాథునికి పంచామృతాభిషేకం అత్యంత వైభవంగా జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఆలయానికి వచ్చే భక్తులకు గోమాతను దర్శించుకోవడంతో పాటు, సాయినాథుని సేవలో పాల్గొనప్పుడే జీవితం సాఫీగా కొనసాగే అవకాశం ఉంటుందన్నారు. ట్రస్టు సభ్యులు శ్రీధర్ స్వామిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మంచికంటి ధనుజంయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి పూరె కృష్ణయ్య, కార్యవర్గ సభ్యులు కుంభం పుల్లారెడ్డి తడకమళ్ల శ్రీనివాస్, సుదర్శన్ పాల్గొన్నారు.

ముర్రుపాలు శిశువుకు మొదటి టీకా

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



నార్కట్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

● ముర్రుపాలుశిశువుకు మొదటి టీకా అని అనుముల మండల వైద్యాధికారి రామకృష్ణ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించి గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. రొమ్ము క్యాన్సర్ రాకుండా కాపాడుకోవచ్చున్నారు. బిడ్డ చురుకుగా ఉండి చదువులో, ఆటల్లో రాణిస్తారని అన్నారు. బిడ్డ పుట్టి ఆరు నెలల వరకు తల్లి పాలు పట్టించాలని, పుట్టిన అరగంటలోనే ముర్రుపాలు పట్టించడం వల్ల అది బిడ్డకు ఇచ్చే మొట్టమొదటి టీకా అని, డబ్బాపాలు, తేనే, గ్లూకోజ్ వాటర్ ఇవ్వడం వల్ల ఇన్ఫెక్షన్‌కు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు.

● హాలియాలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అనసూయ, ఏసీడీపీవో సువర్ణ, సూపర్‌వైజర్ రమాదేవి, ఏడబ్యుటీ సుజాత, మంజుల, విజయలక్ష్మి, కల్పన, నర్మద, వజ్రమ్మ, పుష్ప, హనిమి, వర్ధన, బాజీదాబేగం, గౌస్యాబేగం పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్)లో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.యాదమ్మ, అంగన్‌వాడీ టీచర్లు లీలావతి, నాగమణి, ఆయా లలిత, గర్భిణులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండలంలోని చిత్తలూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి తల్లి పాల ప్రాముఖ్యత గురించి వివరించారు. పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు తరాల శోభారాణి, జి.లలిత, కె.వసంత, ఎస్.అనిత పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని వేంకటేశ్వరనగర్, చింతపల్లి, వర్కాల, నసర్లపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుగుణ, కార్యక్రమంలో టీచర్లు బాదేపల్లి స్వప్న, లీలావతి, యాదమ్మ, బక్కమ్మ, పుణ్యాలు, శారద, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి హఠాన్మరణం



శ్రీహర్ష (ఫైల్‌ఫొటో)

నిడమనూరు, ఆగస్టు 2: నిడమనూరు మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు గుండెపోటుకు గురై కుటుంబ సభ్యుల సమక్షంలో కుప్పకూలి మృతి చెందాడు. డీసీసీబీ డైరెక్టర్, నిడమనూరు సింగిల్‌విండో చైర్మన్ విరిగినేని అంజయ్య ఏకైక కుమారుడు శ్రీహర్ష (37) గుండెపోటుతో శుక్రవారం హఠాన్మరణం చెందాడు. శ్రీహర్ష హైదరాబాద్ నుంచి ఇతర దేశాలకు కూరగాయలు ఎగుమతి చేస్తుంటాడు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్‌లో ఉంటున్నాడు. గురువారం రాత్రి జ్వరం రావడంతో మాత్రలు వేసుకుని నిద్రించాడు. శుక్రవారం ఉదయం ఆస్పత్రికి వెళ్లేందుకు డ్రైవర్ కోసం ఎదురుచూస్తూ ఇంట్లో కుటుంబ సభ్యులతో ముచ్చటిస్తున్నాడు. ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో ఇంట్లోనే కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా యువకుడు అప్పటికే మృతి చెందాడు.

● శ్రీహర్షకు ఓ యువతితో ఇటీవలే వివాహం కుదిరింది. ఆషాఢం ఉన్నందున శ్రావణ మాసంలో ఈ నెల 8న వివాహ నిశ్చితార్థం జరగాల్సి ఉంది. వివాహ నిశ్చితార్థం నిర్వహించేందుకు ఇరు కుటుంబాలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. నిశ్చితార్థం తర్వాత పెళ్లి కూడా ఘనంగా చేయాలని నిర్ణయించారు. కానీ ఇంతలోనే గుండెపోటుతో శ్రీహర్ష అకాల మరణం చెందడంతో రెండు కుటుంబాల్లో విషాదం చోటు చేసుకుంది. చిన్నవయసులోనే కుమారుడు గుండెపోటుతో మృతి చెందడంతో బోరున విలపిస్తున్నారు. బంధుమిత్రులు, నియోజకవర్గంలోని వివిధ పార్టీల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుమారుడి అకాల మరణంతో విలపిస్తున్న అంజయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. శ్రీహర్ష అంత్యక్రియలు శనివారం నిడమనూరులో నిర్వహించనున్నారు. డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, డీఎస్పీ నూకల వేణుగోపాల్‌రెడ్డి, తాజామాజీ జడ్పీటీసీ నందికొండ రామేశ్వరిమట్టారెడ్డి, మాజీ ఎంపీపీ చేకూరి హన్మంతరావు, మేరెడ్డి వెంకట్‌రాహుల్, కదారి అంజయ్య, చినవీరయ్య, శివమారయ్య, శ్రీనివాస్‌రెడ్డి శ్రీహర్ష మృతి పట్ల సంతాపం తెలిపారు.

సంక్షిప్త సమాచారం...

నార్కట్‌పల్లి: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నార్కట్‌పల్లికి చెందిన లింగాల వీరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

మిర్యాలగూడ టౌన్: కులగణన చేపట్టేంత వరకూ పంచాయతీ ఎన్నికలు వాయిదా వేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ అన్నారు. రిజర్వేషన్ల అంశాన్ని పక్కన బెట్టి స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం తగదన్నారు. కుల గణన చేపట్టిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తాల్లపల్లి సురేష్, నాగరాజు, అనిల్, నాగయ్య, వెంకటేశ్వర్లు, సైదులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దామరచర్ల: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ కోటేష్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో మిర్యాలగూడ షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు తబిత, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

గట్టుప్పల్: మండలంలోని నామాపురం జడ్పీ హైస్కూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గంతలు, కంపచెట్లు విపరీతంగా పెరగడంతో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ సర్పంచ్ కంచుకట్ల సంపత్ పనులు చేపట్టారు. గుంతలు పూడ్చిన వెంటనే ప్రహరీ గోడ నిర్మాణం, మూత్ర శాలలు నిర్మాణం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

డిండి: డిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో ప్రవేశానికి మూడవ విడత దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వీరవల్లి రాధకృష్ణ తెలిపారు. కోపా, డ్రాఫ్ట్‌మన్ సివిల్, ఎలక్ట్రీషియన్, పిట్టర్, స్టెనోగ్రఫీ, ట్రేడ్‌లలో ప్రవేశానికి ఈ నెల 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 8,10 తరగతులు ఉత్తీర్ణులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

మిర్యాలగూడ అర్బన్: నిత్యపూజ విధానంలో అనుసరించాల్సిన పద్ధతులపై మహిళలకు దేవాలయ అర్చక పరిషత్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదపండితుడు లక్ష్మీనర్సింహశాస్త్రి మాట్లాడుతూ మహిళలు నిత్యం ఇంట్లో చేసే ఇష్టదైవపూజలో శాస్త్రోక్త పద్ధతులను విధిగా అనుసరించాలన్నారు.

మునుగోడు: మునుగోడు మండలం చల్మెడ గ్రామానికి చెందిన గుండెబోయిన శ్రీరాములుకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా కార్యదర్శి వేమిరెడ్డి అందజేశారు.

చిట్యాల రూరల్: మండలంలోని ఉరుమడ్లకు చెందిన సుంకరబోయిన కమలమ్మ, జిట్టగోని మల్లమ్మ, లింగాల లింగమ్మ మృతిచెందగా వారి కుటుంబ సభ్యులకు గుత్తా వెంకట్‌రెడ్డి ట్రస్టు చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఒక్కో కుటుంబానికి రూ. 10వేల చొప్పున 3 కుటుంబాలకు రూ. 30ల వేలను ట్రస్టు తరఫున పంపించగా కాంగ్రెస్ జిల్లా నాయకుడు కోనేటి యాదగిరి, గ్రామశాఖ అధ్యక్షుడు సీనియర్ నాయకుడు పల్లపు బుద్దుడు, ఉయ్యాల నరేష్ వారికి అందజేశారు.

మర్రిగూడ: రేషన్‌బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి వి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. నాంపల్లి మండలంలోని పౌరసరఫరాల గోదాంలను ఆయన తనిఖీ చేశారు. ప్రతీ నెలా మొదటి తేదీన పీడీఎస్ బియ్యంను రేషన్‌షాపులకు పంపించాలని తెలిపారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా బియ్యం సరఫరా చేపట్టాలని గోదాం ఇన్‌చార్జిలను ఆదేశించారు.

కొండమల్లేపల్లి: రోడ్డుపై పడి ఉన్న వృద్ధుడిని ఇంటి వద్ద దించి ఎస్ఐ రాంమూర్తి మానవత్వం చాటుకున్నారు. శుక్రవారం తన సిబ్బందితో కలిసి చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి వెళ్తున్న క్రమంలో హార్టికల్చర్ కార్యాలయం సమీపంలో రోడ్డు మీద పడి ఉన్న వృద్ధుడు, పెండ్లిపాకలకు చెందిన ఆచారిని గమనించారు. తమ వాహనంలో తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించిన అనంతరం ఆహారం, పండ్లు అందజేసి ఇంటి వద్ద దించారు.

మిర్యాలగూడ: ఇటీవల మృతి చెందిన రిటైర్డ్ ఒకేషనల్ సీపీఎస్ ఉపాధ్యాయులు ఎద్దు ఉపేంద్రం కుటుంబసభ్యులకు బాసటగా చేయూత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఎస్ జిల్లా నాయకులు దొంతిరెడ్డి పంకజ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తడకమళ్ల రోడ్డులోని ఎంవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే కార్యక్రమంలో ఉపేంద్రం కుటుంబసభ్యులకు రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు

పెద్దవూర: మండలంలోని కోనేటిపురంలో గల శ్రీ తిరుమలనాథస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారం చేసింది. నూతన చైర్మన్, వైస్‌చైర్మన్ మండలంలోని కుంకుడు చెట్టుతండా గ్రామపంచాయతీ పరిధిలోని బోనూతల గ్రామానికి చెందిన కల్లూరి వెంకటేశ్వర్‌రెడ్డి, దండు భిక్షంలను కొద్ది రోజుల క్రితం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రమేష్ శ్రీ తిరుమలనాథస్వామి ఆలయంలో చైర్మన్, వైస్ చైర్మన్లతో పాటు ఆలయ కమిటీ సభ్యులు పగడాల మంగమ్మ, రమావత్ లచ్చిరాంనాయక్, మెగావత్ దశరధనాయక్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణానికి చెందిన వాస్తు సిద్ధాంతి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు మామిడి సత్యనారాయణ ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని హరిహర కళాభవనంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ సత్యనారాయణ ఈ అవార్డు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించడంతో పాటు ఆధ్యాత్మిక, సామాజిక సేవలందిస్తున్న సత్యనారాయణను అవార్డుకు ఎంపిక చేశారు.

స.హ.చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలి



దీక్షలో పాల్గొన్న క్రాంతికుమార్

నల్లగొండ క్రైం, ఆగస్టు 2: సమాచార హక్కు చట్టంలోని అన్ని సెక్షన్లను పకడ్బందీగా అమలు చేయాలని సమాచార హక్కు ప్రజా వేగుల న్యాయ సేవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నెకంటి క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. సహచట్టంలోని అన్ని సెక్షన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో సహచట్టం లక్ష్యాలు, ఆశయాల సాధన కోసం ఆయన చేపట్టిన దీక్ష శుక్రవారానికి రెండో రోజుకు చేరుకుంది. సమచార హక్కు చట్టంలో ఉన్న లోపాలను సరిచేయాలని డిమాండ్ చేశారు. అక్టోబరు 2 వరకు డిమాండ్లను నెరవేర్చకపోతే చలో రాష్ట్రపతి భవన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ప్రభుత్వాలు సహ చట్టం ప్రజలకు చేరి న్యాయం చేసే విధంగా చొరవ చూపాలని కోరారు.

జాతికి స్వేచ్ఛా పతాకను అందించిన పింగళి

మిర్యాలగూడ, ఆగస్టు 2: భరతజాతికి స్వేచ్ఛా పతాకను అందించిన మహనీయుడు పింగళి వెంకయ్య అని హైస్కూల్ హెడ్‌మాస్టర్ శిరీష అన్నారు. జాతీయ జెండా రూపశిల్పి పింగళి జయంతి సందర్భంగా మండల పరిధిలోని జప్తివీరప్పగూడెం జడ్పీహెచ్ఎస్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతి కీర్తి ప్రతిష్టలకు ప్రతీకైన మువ్వన్నెల జెండాను రూపొందించిన వెంకయ్య తెలుగువాడు కావడం గర్వకారణమని అన్నారు. రాబోయే తరాలకు జెండా ఔన్నత్యాన్ని తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుడిపాటి కోటయ్య, దామోదర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మాధవి, శ్రీనివాసరెడ్డి, బలరాం, రవి పాల్గొన్నారు.